
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు

శుక్రవారం 25 జూలై 2025



రోడ్డు ప్రమాదాలను నివారించాలి
● సాంకేతికతను ఉపయోగించుకోవాలి
● వాహనదారులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్

8

టాయ్‌లెట్‌లో రేషన్ బియ్యం
● డీలర్‌ను సస్పెండ్ చేసిన అధికారులు

గజ పయనం..!



● నాడు ఆంధ్రాకు, నేడు జపాన్‌కు
● బన్నేరుఘట్ట నుంచి బయల్దేరిన నాలుగు ఏనుగులు
● విమానంలో ఒసాకాలోని కన్సాయ్ ఎయిర్‌పోర్ట్‌కు..
● రాష్ట్రం నుంచి కొనసాగుతున్న ఏనుగుల తరలింపు

కార్గోలోకి గజరాజును ఎక్కిస్తున్న మావటీలు



లారీలో ఎయిర్‌పోర్ట్‌కు తరలిస్తూ..

బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి ఏనుగుల తరలింపు కొనసాగుతోంది. పలు రాష్ట్రాలు, దేశాలకు కర్ణాటక నుంచి గజరాజులను తరలిస్తున్న సంగతి తెలిసిందే. దేశంలోనే ఏనుగులు అత్యధికంగా ఉన్న రాష్ట్రంగా కర్ణాటక పేరుంది. మదగజాలను నియంత్రించే ప్రత్యేక కుంకీ ఏనుగులు ఇక్కడ ఉన్నాయి. దీంతో ఇక్కడి ఏనుగులకు డిమాండ్ పెరిగింది. ప్రకృతికి మానవసంఘర్షణకు మధ్య అంతరాన్ని తగ్గించే ప్రయత్నాలు సాగుతూనే ఉన్నాయి. ప్రత్యేకించి మదగజాలను నియంత్రించే కుంకీ ఏనుగులు కావాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోరగా కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. మే నెలలో విధానసౌధ వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో నాలుగు కుంకీ ఏనుగులను అందజేసింది. మరో రెండు ఏనుగులు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారు. ఇలా రాష్ట్రాల మధ్య ప్రాణుల వినిమయం ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. తాజాగా అంతర్జాతీయ ప్రాణి మార్పిడిలో భాగంగా 4 గజరాజులను జపాన్‌కు పంపారు. బన్నేరుఘట్ట జాతీయ ఉద్యాన వనం నుంచి జపాన్ దేశానికి పంపుతున్నట్లు జూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యసేన్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఢిల్లీలోని సెంట్రల్ జూ అథారిటీ ఇందుకు అంగీకారం తెలిపిందన్నారు. అవసరమైన వివిధశాఖల క్లియరెన్స్ వచ్చిందన్నారు. ఆ దేశంలోని హిమేజి సెంట్రల్ పార్క్ - సఫారీ పార్క్‌కు గజరాజులు వెళ్తున్నాయన్నారు.

జపాన్ నుంచి మరిన్ని జంతువులు

అంతర్జాతీయ ప్రాణి మార్పిడి ఒప్పందంలో భాగంగా జపాన్ నుంచి 4 చిరుతలు, 4 జాగ్వార్‌లు (పెద్ద మచ్చలుగల చిరుతపులి), 4 ప్యూమాలు, 3 చింపాజీలు, 8 కపుచిన్ కోతులు బన్నేరుఘట్ట జూకు రానున్నాయి. తొలిసారిగా బన్నేరుఘట్ట పార్కుకు ప్యూమా జంతువు వస్తోందని జూ డైరెక్టర్ సూర్యసేన్ తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఏ జూలోనూ ఇంతవరకు ప్యూమా లేదన్నారు. జపాన్‌నుంచి కొత్త జంతువుల రాకతో బన్నేరుఘట్ట జూకు కొత్తదనం సంతరించుకోవడం ఖాయమన్నారు. జంతు వినిమయ ఒప్పందంలో ఇవన్నీ జరుగుతాయన్నారు.



మావటీలకు శిక్షణ

బన్నేరుఘట్ట జూ నుంచి 8 అధికారుల బృందం జపాన్‌లో గజరాజులతోపాటు రెండువారాలపాటు ఉండి కొత్త వాతావరణంలోకి అలవాటు అయ్యేందుకు వాటి బాగోగులు చూస్తారన్నారు. కాగా జపాన్ నుంచి మావటీలు మే నెల 12 నుంచి 25వరకు ఇక్కడి జూలో శిక్షణ పొందారన్నారు.

జపాన్‌కు తరలిన గజరాజులివే..

ప్రస్తుతం బన్నేరుఘట్ట జూ నుంచి నాలుగు ఏనుగులు జపాన్‌కు వెళ్తున్నాయని (ఒక మగ, మూడు ఆడవి) తెలిపారు. సురేశ్ (8), గౌరి (9), శృతి (7), తులసి (5) అనే ఏనుగులు కెంపేగౌడ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఒసాకాలోని కన్సాయ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటాయన్నారు. కత్తార్ ఎయిర్‌వేస్ కార్గో ఫ్లైట్ (బోయింగ్ 777-200)లో సుమారు 20 గంటల ప్రయాణం చేసి అవి ఆ దేశానికి చేరుకుంటాయన్నారు. ఆరు నెలలుగా వీటిని శిక్షణ అందించామని, అన్నీ ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. కర్ణాటక నుంచి జపాన్‌కు రెండో విడత బ్యాచ్ ఏనుగుల బృందం వెళ్తోందన్నారు. 2021లో మైసూరు జూ నుంచి జపాన్‌లోని టోయోహస్షి జూకు మూడు ఏనుగులు వెళ్లాయన్నారు. కాగా ప్రస్తుత గజరాజుల వెంట రెండు జూలకు చెందిన వెటర్నరీ అధికారులు, కేటర్ టేకర్స్, ఒక సూపర్‌వైజర్, ఒక బయోలజిస్ట్ ఉన్నారన్నారు.



బన్నేరుఘట్ట జూ పార్క్‌లో ఏనుగులు

46 మంది ఖైదీల విడుదలకు తీర్మానం

● ప్రైవేట్ మెడికల్ సంస్థల సవరణ బిల్లుకు ఆమోదం
● అంబులెన్స్ నిర్వహణ సవరణ బిల్లుకు ఓకే
● మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు



బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సత్ప్రవర్తన కింద 46మందిని విడుదల చేయాలని రాష్ట్రమంత్రివర్గం అంగీకారం తెలిపింది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ అనుమతి పొందిన అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 161 ప్రకారం సత్ప్రవర్తన కింద రాష్ట్రవ్యాప్తంగా వివిధజైళ్లలో ఉన్న ముగ్గురు దోషులను ముందస్తుగా విడుదల చేయనున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల డిమాండ్లకు అనుగుణంగా 2025-06 సంవత్సరానికి సంబంధించి 890 ఔషధాలు, ఇతర అవసరమైన వస్తువులు, రసాయనాలు రూ.880.68 కోట్లతో కొనుగోలు చేసేందుకు కేటీపీపీ చట్టం 1999, కేటీపీపీ నియమాలు 2000 ప్రకారం టెండర్ల ద్వారా పొందేందుకు కేబినెట్ భేటీలో నిర్ణయించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం మంత్రివర్గ సమావేశం జరిగింది. కేబినెట్‌లో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వెల్లడించారు. అంబులెన్స్‌ల నిర్వహణకు సంబంధించి సవరణ బిల్లుకు ఆమోదం తెలిపిందన్నారు. అగ్నిమాపక సవరణ బిల్లు 2025కు ఆమోదం తెలిపారు. అలాగే కర్ణాటక ఫైర్‌ఫోర్స్ యాక్ట్ 1964 సెక్షన్ 15కు సవరణ ప్రకారం రాష్ట్రంలో కొత్తగా నిర్మించే బహుళ అంతస్తుల భవనాలకు ఆస్తి పన్నులో 1శాతం ఫైర్‌సెస్ విధించేలా ప్రస్తావించారు. గిగ్ కార్మికుల (సామాజికభద్రత, సంక్షేమ) బిల్లు 2025, సదరు ఆర్డినెన్స్‌ను వచ్చే శాసనసభ సమావేశాలలో సమర్పించేలా మంత్రివర్గం తీర్మానించిందన్నారు. చిక్కబళ్లాపుర జిల్లాలోని అల్లీపుర గ్రామపంచాయతీని అప్‌గ్రేడ్ చేస్తూ 'అల్లీపుర పట్టణ పంచాయతీ'గా ప్రకటించేలా నిర్ణయించినట్టు తెలిపారు. మండ్యజిల్లా మద్దూరు తాలూకా సూళకెరె చెరువు పునరుజ్జీవన పనులకు రూ.34కోట్లు అంచనా వేశారు. పాలనాపరమైన అనుమతులకు మంజూరు చేశారన్నారు. హావేరి జిల్లా రట్టిహళ్లి తాలూకా మదగమాసూరు చెరువు కుడి కాలువ, ఎడమకాలువల ఆధునీకరణకు రూ.52.20 కోట్లు అంచనా వేశారు. బాల్య వివాహ సవరణ చట్టం 2025కు ఆమోదం తెలిపారు. బెంగళూరు ఇందిరాగాంధీ పిల్లల ఆసుపత్రి 450 పడకల సామర్థ్యానికి అనుగుణంగా అవసరమైన ఉపకరణాలు, ఫర్నీచర్ ఇతరత్రా వాటికి రూ.62కోట్లు అంచనా వేశారన్నారు. మైసూరు జిల్లా టీ నరసీపుర తాలూకా నంజాపుర ఎత్తిపోతల పథకం ఆధునీకరణ పనులకు రూ.20కోట్లు అంచనా వేశారన్నారు. ఇలా సమావేశంలో పలు అంశాలు తీర్మానించినట్లు తెలిపారు.

ఢిల్లీ చేరిన సీఎం, డీసీఎం

● నెల రోజుల్లో ముచ్చటగా మూడోసారి ● అగ్రనేతలతో చర్చల్లో అజెండా ఏమిటో..? ● వారం రోజులుగా అలక వీడని డీకే

బెంగళూరు, జూలై24(ఆంధ్రజ్యోతి): నెలరోజుల వ్యవధిలోనే ముచ్చటగా మూడోసారి సీఎం సిద్దరామయ్య. డీసీఎం డీకే శివకుమార్‌లు ఢిల్లీ చేరారు. గురువారం మంత్రివర్గ సమావేశం ముగియగానే ఇద్దరు నేతలు ఢిల్లీకు బయలుదేరారు. రాత్రి రాష్ట్రపార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలాతో ఇద్దరు నేతలు భేటీ అయ్యారు. సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రెండేళ్ళ వ్యవధిలో ఇద్దరు నేతలు పలుమార్లు కలిసి ఢిల్లీ వచ్చారు. కానీ ఇటీవల పదిరోజుల కిందట ఢిల్లీ వచ్చిన సందర్భంలో రెండుసార్లు సీఎం సిద్దరామయ్య నేనే ఐదేళ్ళు సీఎంగా కొనసాగుతానని నాయకత్వ మార్పు అనేది లేదని ప్రకటించారు. అంతటితో ఆగని సీఎం ఏకంగా డీకే శివకుమార్‌కు ఎక్కువ మంది ఎమ్మెల్యేలు మద్దతు లేదన్నారు. పాలనా పరంగా ఇద్దరు కలిసే ఉన్నట్లు అనిపించినా దాదాపు పదిరోజుల నుంచి డీకే శివకుమార్ అసంతృప్తితో ఉన్నారు. పైగా రెండుసార్లు రాత్రికిరాత్రి ఢిల్లీ వచ్చి వెనుదిరిగారు. ఇటీవల మూడురోజుల పాటు ఎవరికీ అందుబాటులో ఉండనంటూ చెప్పినా రెండురోజుల తర్వాతనే కేబినెట్ భేటీలో పాల్గొన్నారు. బుధవారం హాసన్ జిల్లా చెన్నరాయపట్టణలోని ఓ గ్రామంలోని దేవాలయానికి ప్రైవేటు వాహనంలో భద్రతా సిబ్బంది సహా ఎవరూ లేకుండా వెళ్ళారు. ఇలా పదిరోజులుగా అసంతృప్తితో ఉన్న డీకే శివకుమార్‌కు అధిష్ఠానం పెద్దలు ఏ విధంగా సముదాయిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. మరో వైపు ఇటీవల 20 రోజుల వ్యవధిలో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సూర్జేవలా తొమ్మిదిరోజులు బెంగళూరులో మకాం వేసి మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు ఓడిన అభ్యర్థులు వివిధ కార్పొరేషన్‌ల ఛైర్మన్‌లతోను అభిప్రాయసేకరణ చేశారు. పలువురు మంత్రులతో మీపై వచ్చిన ఫిర్యాదుల గురించి వివరించాలా అంటూ సుర్జేవాలా హెచ్చరించిన విషయం తెలిసిందే. ఇలా ఉండగానే సీఎం, డీసీఎంలు ఢిల్లీలో ఎవరిని కలుస్తారనేది శుక్రవారం తేలనుంది. రాహుల్‌గాంధీను కలిస్తే ఎటువంటి చర్చలు జరుగుతాయనేది కీలకం కానుంది. నాయకత్వ మార్పు ప్రస్తావన తెస్తే రాష్ట్రంలో రాజకీయ సంచలనాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు.



ఢిల్లీలో సూర్జేవాలాను కలిసిన సీఎం, డీసీఎం

అవకతవకలు నిజమే

● రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయి ● రాహుల్ వ్యాఖ్యలకు మద్దతు : సీఎం



బెంగళూరు, జూలై24(ఆంధ్రజ్యోతి): గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటక రాష్ట్రంలో అవకతవకలు జరిగాయని, ప్రత్యేకించి ఓ స్థానానికి సంబంధించి వందశాతం అనుమానం ఉందంటూ లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ రెండురోజులుగా చేస్తున్న వ్యాఖ్యలకు సీఎం సిద్దరామయ్య తీవ్రంగా స్పందించారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తమకూ ఆశ్చర్యం కలిగించడమే కాదని అనుమానాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. బీజేపీ ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగం చేసుకుని జరిపిన అక్రమాలే కాంగ్రెస్ పార్టీ వెనుకబాటుకు కారణమనే వాస్తవం ఇప్పుడు వెలుగులోకి వస్తోందని అభిప్రాయపడ్డారు. రాహుల్‌గాంధీ వ్యాఖ్యలను సంపూర్ణంగా అమోదిస్తానన్నారు. రాహుల్ గాంధీ ఒక్కొక్కటిగా వెలుగులోకి తెస్తున్నారన్నారు. రాష్ట్రంలో పలు నియోజకవర్గాల్లో ఉన్నఫళంగా ఓటర్ల పేర్లు రద్దు అయ్యాయన్నారు. కర్ణాటకలో జరిగిన ఎన్నికల అక్రమాల విషయమై రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేలతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామని ప్రకటనలో పేర్కొన్నారు.

ఆ మాటలు నిజమే: డీసీఎం డీకే

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు వాస్తవమేనని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు గ్రామీణ ఎన్నికలలో ఘోరపరాజయం తర్వాత సర్వే జరిపామన్నారు. ఇక్కడ పలు విధాల గోల్‌మాల్ జరిగిందన్నారు. ప్రస్తుతానికి అంతకుమించి వ్యాఖ్యానించలేనని సమయం వచ్చినప్పుడు సమగ్రంగా వివరిస్తానన్నారు.

అభిమన్యుతోపాటు

తొమ్మిది ఏనుగులు

● సంబరంగా మైసూరు దసరా ● మంత్రి ఈశ్వర్ ఖండ్రే



దసరా ఉత్సవాల పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రి, అధికారులు

బెంగళూరు, జూలై24 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మైసూరు దసరా ఉత్సవాలకు అభిమన్యు గజరాజుతో పాటు తొమ్మిది ఏనుగులను ఎంపిక చేశారు. గురువారం విధానసౌధలో గజరాజుల వివరాలను అటవీశాఖామంత్రి ఈశ్వర్‌ఖండ్రే ప్రకటించారు. మొత్తం 14 ఏనుగులను ఎంపిక చేశామని వాటిలో 9 ఏనుగులను ఖరారు చేశామన్నారు. ఆగస్టు 4వతేదీ సోమవారం తొలివిడత ఏనుగుల బృందం వీరనహొసహళ్ళి నుంచి బయలుదేరుతాయన్నారు. జంబూసవారీ ఉత్సవంలో అంబారీ మోసే అభిమన్యు ఈ ఏడాది కెప్టెన్‌గా వ్యవహరిస్తుందన్నారు. అభిమన్యు 300కు పైగా ఏనుగులను కట్టడి చేయడంతో పాటు 80కు పైగా పులులనుంచి రక్షణ కల్పించేలా వ్యవహరించినట్లు తెలిపారు. ఇదో ప్రముఖమైన కుంకీ ఏనుగుగా మంత్రి అభివర్ణించారు. జంబూసవారీకు ఎంపిక చేసిన గజరాజులలో మత్తిగోడు శిబిరంకు చెందిన 25 ఏళ్ళ భీమ, దుబారే శిబిరానికి చెందిన 24 ఏళ్ళ కంజన్, 44 ఏళ్ళ ధనుంజయ, 53 ఏళ్ళ ప్రశాంత్, బళ్ళే బిరానికి చెందిన 42 ఏళ్ళ మహేంద్ర, దొడ్డహరవ శిబిరానికి చెందిన 40 ఏళ్ళ ఏకలవ్య, 45 ఏళ్ళ కావేరి, 53 ఏళ్ళ లక్ష్మీ ఏనుగులు ఉన్నాయన్నారు. అటవీ ప్రధాన సంరక్షణాధికారి మీనాక్షినేగి, ముఖ్య అధికారులు పీసీ రే, మహేష్ శిరూర్, మనోజ్‌కుమార్, మాలతి, ప్రభుగౌడ తదితరులు పాల్గొన్నారు.

కళాసిపాళ్యలో ప్రయాణం భయం.. భయం!

7



నడి రోడ్డుపై గోతులతో ఇబ్బంది పడుతున్న ఆటోవాలా



ఇంకెన్నాళ్లు..?

● 13లక్షల కుటుంబాలకు సొంతిల్లు కలే...!
● రాయచూరు జిల్లాలో లక్షమందికి పైగా.. ● 31 జిల్లాల్లోనూ ఇల్లులేని బడుగులు ఎందరో..

బెంగళూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది పదులు కావస్తోంది. ప్రతి కుటుంబానికి కూడు, గూడు, గుడ్డ అవసరాలని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయి. ఆకలి మరణాలు లేని సమాజం, ఒంటినిండా కప్పుకునేందుకు గుడ్డ, తల దాచుకునేందుకు గూడు ప్రతి వ్యక్తికి ప్రధానమైనవి. దశాబ్దాలు గడుస్తున్నాయి. ఇటు రాష్ట్రం అటు కేంద్రప్రభుత్వం ఏటా లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నారు. కానీ సకాలంలో వైద్యం అందక మృతి చెందేవారు, సొంతిల్లు లేక నిస్సహాయ స్థితిలో ఉన్న అభాగ్యులు ఎందరో ఇంకా రాష్ట్రంలో ఉండడం విచారం కలిగిస్తోంది. దేశంలో అభివృద్ధి చెందిన రాష్ట్రంగా పేరొంది ఐటీతోపాటు ఎన్నో రంగాల్లో ప్రపంచస్థాయిలో పోటీ పడుతున్న రాష్ట్రంలో సొంతిల్లు లేని కుటుంబాలు 13లక్షల దాకా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది.

● రాష్ట్రంలో ఇటీవల శాశ్వతమైన ఇల్లులేని వారిని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే జరిగింది. ఇందులో 12,87,509 కుటుంబాలకు సొంత ఇల్లు లేవని నిర్ధారించారు. బెంగళూరు నగరంలో సొంతిల్లు లేనివారు వేలమంది ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో నివసించే ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలని, ఇల్లు లేనివారు ఉండరాదని కేంద్రప్రభుత్వం 'ప్రధానమంత్రి ఆవాజ్ యోజన' ద్వారా ఏటా లక్షలాది ఇళ్లను మంజూరు చేస్తోంది. అంతకు ముందు దేశంలో ఎంతమందికి సొంత ఇల్లు లేవని సర్వే చేయించింది. ఈ ఏడాది మే 15వరకు రాష్ట్రంలో 12.87 లక్షల మందికి ఇళ్లు లేవని తేలింది. రాయచూరు జిల్లాలో అత్యధికంగా 1.6 లక్షల కుటుంబాలకు సొంత ఇళ్లు లేవని నిర్ధారణ అయ్యింది. ఆ తర్వాతి స్థానంలో బీదర్‌లో 92,812మందికి ఇళ్లు లేవని స్పష్టమైంది. ఇళ్లు లేనివారి జాబితాను తయారు చేసి వాటికి అనుగుణంగా ఇళ్లను మంజూరు చేయాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో రాజకీయ పలుకుబడి, ఇతరత్రా కారణాలతో ఇల్లు ఉన్నవారికే మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

స్థానిక గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది సహకారంతో ఇల్లు లేనివారిని గుర్తించేందుకు సర్వే చేపట్టారు. లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు అద్దె ఇంటితోపాటు ఫొటోను, బ్యాంకు పాస్ బుక్, ఇతరత్రా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసలుబాటు కల్పించారు.

● సాధారణంగా ఓ కుటుంబానికి ఒక ఇల్లు ఉంటుంది. పిల్లలు పెద్దవారై పెళ్ళిళ్ళు చేసుకున్నాక వేరు కుటుంబంగా విడిపోతారు. ఇలాంటివారితోపాటు శాశ్వతంగా ఇళ్లులేనివారిని గుర్తించాల్సి ఉన్నా పాలన సాగించే పార్టీ ప్రాంతీయ నాయకుల కనుసైగలలోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఆ విధానమే ఇల్లు లేనివారి సంఖ్య ఏటా పెరిగేందుకు కారణమవుతోంది. కొన్ని ప్రాంతాల్లో పలుకుబడితో 2-3ఇళ్లను మంజూరు చేయించుకుని, ఒకే ఇంటిని విలాసవంతంగా నిర్మించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేల అధ్యక్షతన సమీక్షలు జరుగుతాయి. రాష్ట్రంలో ఎమ్మెల్యేలతో ప్రమేయం లేకుండానే పంచాయతీ, హోబళి స్థాయి రాజకీయ పార్టీల వారు నేరుగా జాబితాలను మంజూరు చేయిస్తున్నట్లు పలు చోట్ల వెల్లడయ్యింది. ఇటీవల కలబురగి జిల్లా ఆలంద నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రమేయం లేకుండానే ఇల్లు మంజూరు చేసిన విషయం, ఎమ్మెల్యే బీ ఆర్ పాటిల్ ఫోన్‌కాల్‌తో రాజకీయ అలజడి చెలరేగిన విషయం తెలిసిందే.

జిల్లాల వారీగా ఇల్లు లేని వారి వివరాలు


జిల్లా	కుటుంబాలు		
రాయచూరు	1,06,032	గదగ్	27,129
బీదర్	92,812	హావేరి	57,665
బెళగావి	80,832	కలబురగి	70,166
హాసన్	74,519	కొడగు	2,883
తుమకూరు	80,076	కోలారు	41,135
బాగల్కోటె	42,620	కొప్పళ	50,490
బళ్ళారి	35,159	మండ్య	36,215
బెంగళూరు	1,170	మైసూరు	50,206
బెంగళూరు గ్రామీణ	8,418	రామనగర	8,531
చామరాజనగర	35,050	శివమొగ్గ	15,962
చిక్కబళ్ళాపుర	33,720	ఉడుపి	4,638
చిక్కమగళూరు	21,969	ఉత్తరకన్నడ	17,248
చిత్రదుర్గ	37,999	విజయనగర	58,917
దావణగెరె	26,138	విజయపుర	70,934
ధారవాడ	27,025	యాదగిరి	64,341



కంప్యూటర్ ఆపరేటర్ ఆత్మహత్య

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతుకుంట బ్రిడ్జి కింద మారుతీనగర్‌కు చెందిన మంచిరెడ్డి మోహన్‌రెడ్డి(45) గురువారం సాయంత్రం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు మృతుడు మోహన్‌రెడ్డి నల్లమాడ ఎమ్మార్సీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. ఈయన మూడు నెలల కిందటే నల్లమాడకు వెళ్లారు. మంగళవారం పని నిమిత్తం ధర్మవరం వచ్చాడు. ఏం జరిగిందో ఏమో కానీ పోతుకుంట బ్రిడ్జి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కీమెన్ సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య మాధవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి తెలిపారు.

సైబర్ నేరగాళ్ల కొత్త ఎత్తులు



సైబర్ నేరగాళ్లు చేసిన ఫోన్ నంబర్లు

బొమ్మనహాళ్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు డబ్బు దోపిడీకి కొత్త ఎత్తులు వేస్తున్నారు. వెలుగు కార్యాలయం నుంచి మాట్లాడుతున్నామనీ, ఫోన్ పే ఓపెన్ చేయాలంటూ ఓ మాజీ సర్పంచ్‌కే మోసం చేయాలని ప్రయత్నించారు. ఆయన అప్రమత్తమవడంతో తప్పించుకున్నాడు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ మాజీ సర్పంచ్ మారుతీప్రసాద్‌ను గతేడాది సైబర్ నేరగాళ్లు మోసం చేసి, రూ.25 వేలు కొట్టేశారు. తాజాగా గురువారం 9991517668 నంబర్ నుంచి మారుతీప్రసాద్ ఫోన్‌కు కాల్ వచ్చింది. 'మీ అమ్మకు పెన్షన్ వచ్చిందనీ, బ్యాంకు లింక్ లేదనీ, మీ అకౌంట్‌కు వేస్తామనీ, ఖాతా నంబరు చెప్పాల'ని అడిగారు. వారి మాటలు నమ్మి మారుతీప్రసాద్ బ్యాంకు ఖాతా నంబర్ చెప్పారు. డబ్బు బదిలీ కావట్లేదనీ, ఫోన్ పేకి వేస్తామనీ, ఓపెన్ చేసుకోవాలన్నారు. మారుతీప్రసాద్‌కు అనుమానం వచ్చి మందలించి ఫోన్ కట్ చేశాడు. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల విచారణలో సైబర్ నేరగాళ్ల నంబర్‌గా తేలింది. అకౌంట్‌లోని నగదును ట్రాన్స్‌ఫర్ చేసుకోవాలని పోలీసులు సూచించారు. గతంలో కూడా సైబర్ ఉచ్చులో పడి రూ.25 వేలు పోగోట్టుకున్నట్లు బాధితుడు మారుతిప్రసాద్ తెలిపారు.

భక్తులకు గమనిక..!

రేపటి నుంచి మంత్రాలయానికి కొత్త బస్సు సర్వీసు

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డిపో నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయానికి కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలోతెలిపారు. ఈ సర్వీసు ఈనెల 26న ఉదయం 5-15గంటలకు ప్రారంభిస్తామన్నారు. ఈ బస్సు అనంతపురం, గుత్తి, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు మీదుగా మంత్రాలయానికి 11గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి మంత్రాలయంలో 11-30గంటలకు బయలుదేరి సాయంత్రం 5-15గంటలకు ధర్మవరం చేరుకుంటుందన్నారు.

చదువుతో అసమానతలు దూరం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్


విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

అనంతపురం టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో అసమానతలు దూరమవుతాయని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన తొగట వీర క్షత్రియ విద్యార్థులకు గురువారం స్థానిక బెంగళూరు రోడ్డులోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో నగదు పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ.. చేనేత కులాలకు చెందిన ఎంతోమంది పిల్లలు ఉన్నత చదువులు చదివి వివిధ రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం ఇటీవల పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ కల్యాణమండపం అధ్యక్షుడు దాసరి శ్రీధర్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు, రామాంజప్ప, ప్రధాన కార్యదర్శి చింతా వెంకటేశ్వర్లు, కోశాధికారి చిదంబరయ్య, శేషయ్య, రూప ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

ధర్మవరం-షోలాపూర్ మధ్య ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ధర్మవరం-షోలాపూర్ మధ్య అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. షోలాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (01437) ఈ నెల 24న రాత్రి 11-20 గంటలకు షోలాపూర్‌లో బయల్దేరి 26న ఉదయం మూడున్నరకు ధర్మవరం చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (01438) ఈ నెల 26న ఉదయం ఆరున్నరకు ధర్మవరంలో బయల్దేరి ఆదివారం ఉదయం 10-45 గంటలకు షోలాపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు కురుద్వాడి, బర్సి టౌన్, ధారాశివ్ లాతూర్, లాతూర్ రోడ్, ఉదయగిరి, భల్కి, బీదర్, హోమ్నాబాద్, వాడి, యాదగిరి, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, మదనపల్లి రోడ్డు, ములకలచెరువు, కదిరి స్టేషన్ల మీదుగా ధర్మవరం చేరుకుంటుందన్నారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురంరూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1230 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

తెరుచుకోని సచివాలయం

గుడిబండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరహట్టి పంచాయతీ సచివాలయం గురువారం మూతపడింది. అధికారులు ఎవరూ హాజరు కాకుండా కార్యాలయం తెరుచుకోకపోవడంతో రైతులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పనుల నిమిత్తం ఆధార్‌కార్డు అప్డేట్ రైతుల వన్‌బిలు, అడంగల్ తదితర వాటికోసం వచ్చిన వెనుతిరిగారు. ఈ విషయమై ఎంపీడీఓ కేశవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



తెరుచుకోని దేవరహట్టి సచివాలయం

వడ్డీ జలగల అరాచకాలు



- వారానికి నూటికి రూ.10 వడ్డీ
- అసలు కంటే ఎక్కువ రెట్లు చెల్లింపు
- ఇంకా.. ఇవ్వాలంటూ వేధింపులు
- ధర్మవరంలో రెండు చోట్ల దాడులు
- కేసులు నమోదు

ధర్మవరం, జూలై 24(ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ జలగల అరాచకాలు తీవ్రమవుతున్నాయి. అడిగేవారెవరు, అడ్డుకునేవారెవరన్నట్లుగా పేట్రేగిపోతున్నారు. వారానికి నూటికి రూ.10 వడ్డీ వసూలు చేయడంతోపాటు, తీసుకున్న అప్పునకు మూడు, నాలుగు రెట్లు అధికంగా చెల్లించినా.. ఇంకా ఇవ్వాలంటూ వేధిస్తున్నారు. చెల్లిస్తామని వేడుకుంటున్నా వినకుండా ఏకంగా దాడులకు తెగబడుతున్నారు. ధర్మవరంలో వడ్డీ జలగల అరాచకాలపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

రెండు రెట్లకు పైగా చెల్లించినా..

పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బసిరెడ్డిగారి ఆనందరెడ్డి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మేడాపురం రామయ్య వద్ద వారానికి నూటికి రూ.10 వడ్డీతో ఏడాదిన్నర క్రితం రూ.2.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఇప్పటికే రూ.1.50 లక్షలు వడ్డీకింద చెల్లించాడు. అసలు చెల్లించాలంటూ రామయ్య.. ఆనందరెడ్డిపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో ఆనందరెడ్డి రూ.4.50 లక్షలు అప్పు తీసుకొచ్చి రామయ్యకు అసలు, వడ్డీ మొత్తం చెల్లించాడు. అయినా రామయ్య వడ్డీ దాహం తీరలేదు. తనకు ఇంకా చెల్లించాలంటూ ఆనందరెడ్డి ఇంటి వద్దకెళ్లి, అవమానించి బెదిరించాడు. ఈనెల 17వతేదీ ఆనందరెడ్డి కదిరి గేటు వైపు వెళ్తుండగా రామయ్య, అతడి కుమారులు ప్రదీప్, మంజు.. దాడి చేశారు. అటువైపు వెళ్తున్న రాజు, నరేశ్ విడిపించారు. దాడిపై ఆనందరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామయ్య, అతడి కుమారులు ప్రదీప్, మంజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తండ్రి, కుమారుడిపై దాడి

శాంతినగర్‌లో రమణ, దేవరశెట్టి భారతి దంపతులు నివాసముంటున్నారు. రమణ ఎర్రగుంటకు చెందిన రాజుతో రూ.6.10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వారానికి నూటికి రూ.10 వడ్డీ ప్రకారం రూ.60వేలు చెల్లిస్తున్నాడు. రమణ పట్టుచీరల వ్యాపారం చేస్తుండగా.. ఆయన భార్య ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు వడ్డీ రూపంలో రూ.15 లక్షలు చెల్లించారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల మూడు నెలల నుంచి వడ్డీ కట్టలేకపోయారు. అప్పటి నుంచి రాజు.. రమణకు ఫోన్ చేసి, డబ్బు కట్టమని బెదిరించడంతోపాటు భయపెట్టేలాప్రవర్తించాడు. రమణ వ్యాపారం నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లినపుడు ఇంట్లో భార్య భారతి ఒంటరిగా ఉన్న సమయంలో కాలింగ్‌బెల్ కొట్టడం, గేటు గ్రిల్ చప్పుడు చేయడం చేస్తూ అసభ్యకరంగా తిట్టి వెళ్లేవాడు. దీంతో రమణ భూమి అమ్మి డబ్బు కడతాననీ, తన ఇంటి వద్దకు రావద్దని చెప్పినా రాజు వినలేదు. ఇంటి వద్దకు వచ్చి చంపుతామని బెదిరింపులకు దిగేవాడు. ఈక్రమంలో రాజు.. తన అనుచరులను గురువారం రమణ ఇంటిపైకి పంపి బెదిరించాడు. రమణ, కుమారుడు చరణ్‌సాయిపై దాడి చేసి, వారి నుంచి రూ.7వేలు లాక్కున్నారు. రమణ కుటుంబసభ్యులు అరవడంతో చుట్టుపక్కల వారు వచ్చి అడ్డుకున్నారు. దీనిపై రమణ భార్య భారతి ఫిర్యాదుమేరకు ఎర్రగుంట రాజు, మహేశ్, వినోద్, మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

వలస బతుకు ఛిద్రం

- నెల కిందటే పెనుకొండకు బళ్లారి వాసి
- పంక్చర్ షాపు పెట్టుకుని జీవనం
- కంటైనర్ దూసుకురావడంతో దుర్మరణం
- కుమారుడికి గాయాలు


పంక్చర్ షాపుపైకి దూసుకెళ్లి బోల్తాపడిన కంటైనర్

బతుకుపోరు విషాదాంతమైంది..
వలస బతుకు ఛిద్రమైంది..
భార్యాబిడ్డలతో ఊరుగాని ఊరొచ్చాడు..
పంక్చర్‌షాపుతో జీవనం మొదలెట్టాడు..
నెల కూడా తిరగలేదు..
మృత్యువు దూసుకొచ్చింది..
రెప్పపాటులో ఆయువు తీసింది..
అక్కడే ఉన్న బిడ్డా గాయపడ్డాడు..
బతుకుబండి తల్లకిందులైంది..
పెద్దదిక్కు ప్రాణాలు పోయాయి..
భార్యాబిడ్డలు దిక్కులేని వారయ్యారు..

పెనుకొండ రూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): నెలరోజుల క్రితమే వలస వచ్చిన వ్యక్తి బతుకుపోరు అర్థాంతరంగా ముగిసింది. మండలంలోని దుద్దేబండ క్రాస్ వద్ద జాతీయ రహదారి పక్కన పంక్చర్ షాపుపైకి గురువారం మధ్యాహ్నం కంటైనర్ దూసుకెళ్లడంతో ఫకృద్దీన్(36) దుర్మరణం చెందగా.. అతడి కుమారుడు మహ్మద్ ముస్తాక్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. కియ ఏఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన ఫకృద్దీన్ నెలరోజుల క్రితం పెనుకొండకు వలస వచ్చాడు. దర్గాపేటలో నివాసముంటూ దుద్దేబండ క్రాస్‌వద్ద జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో పంక్చర్‌షాపు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం షాపు ముందు ఫకృద్దీన్ పనిలో నిమగ్నమై ఉన్నాడు. కుమారుడు మహ్మద్ ముస్తాక్ షాపు లోపల ఉన్నాడు. ఆ సమయంలో బెంగళూరు నుంచి కియ వైపు వెళ్తున్న కంటైనర్ అతివేగంతో అదుపుతప్పి సర్వీసురోడ్డులోని ఫకృద్దీన్ పంక్చర్ షాపుపైకి దూసుకెళ్లింది. ఫకృద్దీన్ పైనుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. షాపు పాక్షికంగా కూలడంతో మహ్మద్ ముస్తాక్ స్వల్పగాయాలతో బటయపడ్డాడు. వెంటనే కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. కుమారుడు మహ్మద్ ముస్తాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఫకృద్దీన్‌కు భార్య ప్రహానా, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వారంతా పెద్దదిక్కును కోల్పోయి, రోడ్డున పడ్డారు.


ఫకృద్దీన్ (ఫైల్)

అధికంగా కృష్ణాజలాలు

కేటాయింపులకు మించి తీసుకుంటాం

జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్


కృష్ణా జలాలకు హారతి ఇస్తున్న జలవనరుల శాఖ ఇంజనీర్లు

అనంతపురం క్లాక్‌టవర్/బెళుగుప్ప, జూలై24(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ద్వారా కేటాయింపుల కంటే అధికంగా కృష్ణాజలాలు తీసుకుంటామని జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌ల సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ తెలిపారు. జీడిపల్లి రిజర్వాయర్‌కి కృష్ణాజలాలు చేరడంతో గురువారం జిల్లా రైతులతో కలిసి జలవనరుల శాఖ, హంద్రీనీవా ఇంజనీర్లు ప్రత్యేక పూజలు చేశారు. రిజర్వాయర్ వద్ద జలహారతి ఇచ్చారు. అనంతరం ఇంజనీర్లను రైతులు సత్కరించారు. జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజాస్వరూప్‌కుమార్ మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్‌తో నీటి వృథాను అరికడతామన్నారు. ఈనెల 17వతేదీన మల్యాల వద్ద నీటిని సీఎం చంద్రబాబునాయుడు విడుదల చేయగా... 22న జిల్లా సరిహద్దు రాగులపాడు వద్దకు కృష్ణాజలాలు చేరాయన్నారు. గురువారం జీడిపల్లికి చేరాయన్నారు. రాగులపాడు వద్ద మొదటిసారిగా 5 మోటార్లతో ఎత్తిపోతలను ప్రారంభించామని, జీడిపల్లి రిజర్వాయర్ 5 రోజుల్లో 5.5 టీఎంసీల వరకు వచ్చే నీటిని పీఏబీఆర్, ఎంపీఆర్‌కు విడుదల చేస్తామని తెలిపారు. జీడిపల్లి, గొల్లపల్లి, చెర్లోపల్లి, మారాల రిజర్వాయర్లతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 165 చెరువులను కృష్ణా జలాలతో నింపుతామన్నారు. వేగంగా కావాల్సినంత నీటిని తీసుకుని ఆయా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వ చేసుకునే వెసులుబాటు లభించిందన్నారు. రాబోయే రోజుల్లో రెండు పంటలకు సాగునీరు వచ్చే అవకాశం ఉందన్నారు. కేటాయించిన నీటి కంటే ఎక్కువగా తీసుకునే అవకాశం దక్కడం శుభపరిణామమన్నారు. మల్యాల నుంచి 3,400 క్యూసెక్కుల నీటిని తీసుకువచ్చి రాయలసీమను సస్యశ్యామలం చేయడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు రామకృష్ణయాదవ్, రామకృష్ణ, రమణ, పృథ్వీ సర్పంచ్ వెంకటనాయుడు, దుద్దేకుంట తిమ్మప్ప, నరేంద్ర, దామోదర్, తిమ్మప్ప, పురుషోత్తం పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న సినీనటుడు శ్రీకాంత్ దంపతులు


అలంకరణలో అమ్మవారు

తాడిపత్రి, జూలై24(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంటపల్లిలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవిని గురువారం సినీనటుడు శ్రీకాంత్, ఊహ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించారు. అమ్మవారి ఉపాసకుడు వీరేష్ స్వామి.. శ్రీకాంత్ దంపతులకు శాలువా కప్పి, సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


శ్రీకాంత్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అభివృద్ధి ప్రాజెక్టులకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్

అనంతపురం జూలై 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో మంత్రిమండలి సమావేశం జరిగింది. అందులో ఆరోఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ (గతంలో అరబిందో రియాల్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ ప్రైవేటు లిమిటెడ్)కు కేటాయించిన 800 మెగా వాట్ల శింగనమల పీఎస్‌పీ కెపాసిటీ ప్రాజెక్టు రద్దుకు చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. జేఎస్‌డబ్ల్యూనియో ఎనర్జీ లిమిటెడ్ అభ్యర్థన మేరకు వైఎస్ఆర్ కడప జిల్లా జమ్మలమడుగు బదులుగా శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం సున్నపురాళ్లపల్లి, ఇతర గ్రామాల్లో 1450 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం ఆర్.అనంతపురం గ్రామంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేసేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీంతోపాటు ఏపీఐఐసీ ద్వారా వివిధ సర్వే నెంబర్లల్లో 439.27 ఎకరాల భూమిని ఉచితంగా కేటాయించాలని రెవెన్యూ శాఖ చేసిన ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసింది.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో గురువారం కిలో టామోటాల ధర గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.17, సరాసరి ధర రూ.25తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన: కలెక్టర్


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణాభివృద్ధి పనుల పరిశీలన కోసం శుక్రవారం నుంచి ఆగస్టు 1వరకు కేంద్ర బృందం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ చేతన్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులపై కేంద్ర బృందం సభ్యుడు దయాకర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రం బృందం సభ్యులు 25 నుంచి ఆగస్టు 1వరకు అమరాపురం, గాండ్లపెంట, రామగిరి మండలాల్లోని 8 గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తారన్నారు. కేంద్ర బృందం గ్రామీణాభివృద్ధి పనులపై లబ్ధిదారులతో సమావేశం అవుతుందన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం, పింఛన్ల పంపిణీ, మహిళా సంఘాల పనితీరు, హౌసింగ్, వాటర్‌షెడ్, తదితర పథకాల అమలుపై పరిశీలిస్తారన్నారు. కేంద్ర బృందం సభ్యులకు స్థానిక అధికారులు సహకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, డీపీఓ సమత తదితరులున్నారు.

రిటైర్డ్ ఏఎస్ఐ దౌర్జన్యం

- పొలం విషయంలో గొడవ
- కొడవలితో దాడి.. ఇద్దరికి గాయాలు


కొడవలితో బెదిరిస్తున్న రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్

బెళుగుప్ప, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఏఎస్ఐ దౌర్జన్యానికి దిగాడు. వేటకొడవలితో బీభత్సం సృష్టించాడు. మండలంలోని ఆవులెన్న గ్రామంలో గురువారం పొలం విషయమై ఇద్దరిపై కొడవలితో దాడి చేయడంతో వారు ఆస్పత్రి పాలయ్యారు. ఎస్ఐ శివ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆవులెన్నకు చెందిన రైతు నాగరాజు, రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్ మధ్య సర్వే నంబరు 97.98లో పొలం విషయమై వివాదం ఉంది. అధికారులు సర్వే చేసి హద్దులు కూడా ఏర్పాటు చేశారు. 24 సెంట్ల విషయంలో మాత్రమే వివాదం ఉంది. ఈ నేపథ్యంలో రైతు నాగరాజు గురువారం కుటుంబ సభ్యులతో కలిసి కంది విత్తేందుకు వెళ్లాడు. అనంతపురంలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ఏఎస్ఐ కృష్ణకుమార్ కొడవలితో ఆగ్రహంగా వచ్చాడు. రైతు నాగరాజు భార్య నాగలక్ష్మి, విత్తనం వేసేందుకు వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్ అశోక్‌పై దాడి చేశాడు. వారికి గాయాలవడంతో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దాడిపై బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

24 మందికి ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి

ఉత్తర్వులు జారీ చేసిన డీఐజీ ప్రవీణ్

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 24 మంది ఏఎస్ఐలకు ఎస్‌లుగా ఉద్యోగోన్నతి లభించింది. జోన్-4 పరిధిలోని అనంతపురం, కర్నూలు జిల్లాల్లో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరికి వేర్వేరు జిల్లాల్లో పోస్టింగ్ ఇచ్చారు. ఉద్యోగోన్నతి పొందినవారిలో జిల్లాకు చెందిన రామచంద్రారెడ్డి, రాజశేఖర్, ఎం.రామక్రిష్టారెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌కి కర్నూలు జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాసగౌడ్, షఫీవుల్లా, వై.రామక్రిష్టారెడ్డి, రామాంజినేయులు, సంపత్ కుమార్‌కి నంద్యాల జిల్లా, అశ్వత్థనారాయణరెడ్డి, వేణుచారి, శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి, రామమోహన్, కిష్టప్ప, త్రిలోక్‌నాథ్, నాగేశ్వర్‌రెడ్డి, షేక్షావలి, నాగరాజును తిరుపతి జిల్లాకు, రామాంజినేయులు, రమేష్, సూర్యనారాయణ, నారాయణరెడ్డికి అన్నమయ్య జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. ఉత్తర్వులు అందుకున్న 15 రోజుల్లో విధుల్లో చేరాలని డీఐజీ ఆదేశించారు. ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందినవారు ఎస్పీ జగదీష్‌ని శుక్రవారం కలవనున్నారని సమాచారం.

అహుడా పనులను వేగవంతం చేయాలి

- జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో ఉన్న పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి అహుడా పనితీరుపై సమీక్షించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని ఎంఐజీ లేఅవుట్ల భూముల సేకరణ పనులు వేగవంతం చేయాలన్నారు. పెండింగ్ పనులను పరిశీలించి, అవసరమైన మేరకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం తర్వాత ప్రజలు నివసించడానికి అనువైన మౌలిక సదుపాయాలు అందించగలిగే భూములను గుర్తించాలన్నారు. పెనుకొండ, ధర్మవరం, మడకశిర, గుత్తి, కూడేరు, కందుకూరు ప్రాంతాల్లో లేఅవుట్ల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్ పాల్గొన్నారు.

జర్మనీలో నర్సు ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జర్మనీలో నర్సు ఉద్యోగాల కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి శివరంగప్రసాద్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందుకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 35ఏళ్లలోపు వయసు, బీఎస్సీ నర్సింగ్ పూర్తిచేసి రెండేళ్ల క్లినికల్ అనుభవం కలిగిన, జీఎన్ఎం నర్సింగ్ పూర్తి చేసి, మూడేళ్ల అనుభవం ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి తిరుపతి, విశాఖపట్టణం, గుంటూరులో గిరిజన, సాంఘిక సంక్షేమశాఖల ఆధ్వర్యంలో జర్మన్ భాషపై 8 నుంచి 10 నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఈనెల 29వతేదీలోపు dsweo.sss@gmail.com కి మెయిల్ ద్వారా కానీ, జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7981333346 నంబరులో సంప్రదించాలన్నారు.

వైభవంగా చౌడేశ్వరీమాత జయంతి


పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు


హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి జయంతి గురువారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి పంచామృతాభిషేకం, కళశాచర్చన, నవగ్రహహోమం, చండీ హోమం నిర్వహించారు. శివబాలయోగి ఆశ్రమం నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, మునిసిపల్ ఛైర్మన్ రమేష్, నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు టీడీపీ నాయకులు కోరుముట్ల నాగేంద్ర, మంగేష్, తిరుపతయ్య, మాచి, అమర్నాథ్, ప్రెస్‌ఎవ ఎంకటేశ్, చంద్రమోహన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్సింపల్లి, గోరంట్లలో చౌడేశ్వరీ అమ్మవారి జయంత్యుత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. నార్సింపల్లిలో భవానీ మాతను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గోరంట్లలోని చౌడేశ్వరీ ఆలయంలో అర్చకులు నాగభూషణ అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

సెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్ (జయంతి)



ఆధునిక కర్ణాటక సంగీత పితామహగా పేరొందిన 'పద్మవిభూషణ్' పురస్కార గ్రహీత సెమ్మంగుడి రాధాకృష్ణ శ్రీనివాస అయ్యర్ 1908 జూలై 25న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా తిరుక్కోడివల్‌లో జన్మించారు. సమకాలీనులైన జీఎన్ బాలసుబ్రమణియమ్, మధురై మణి అయ్యర్‌లతో కలసి 20వ శతాబ్దపు కర్ణాటక సంగీతత్రయంగా పేరొందారు. తిరువనంతపురంలోని స్వాతి తిరునాల్ సంగీత కళాశాలకు ప్రిన్సిపాల్‌గా, ఆలిండియా రేడియో మద్రాస్‌లో కర్ణాటక సంగీతంలో చీఫ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు. శిష్యులు ఆయనను 'సెమ్మంగుడి మామ' అని అప్యాయంగా పిలుస్తారు. 'పద్మభూషణ్' 'సంగీత కళానిధి' ఇతర పురస్కారాలు, కేరళ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. 2003 అక్టోబరు 31న కన్నుమూశారు.

కైకాల సత్యనారాయణ (జయంతి)



'నవరస నటనా సార్వభౌమ' బిరుదు పొందిన కైకాల సత్యనారాయణ 1935 జూలై 25న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం కౌతవరం గ్రామంలో జన్మించారు. తెలుగు సినిమా గోల్డెన్ ఎరాలో గొప్ప నటులలో ఒకరిగా నిలిచారు. ఆరు దశాబ్దాలలో 750కుపైగా సినిమాలలో నటించారు. పౌరాణిక, జానపద, సాంఘిక, యాక్షన్ సినిమాలలో విభిన్నపాత్రలలో నటించి అభిమానులను అలరించారు. రఘుపతి వెంకయ్య జాతీయ సినీ పురస్కారం అందుకున్నారు. ఫిల్మ్‌ఫేర్, నంది అవార్డు, జీవిత సాఫల్య పురస్కారం ఇతర అవార్డులు అందుకున్నారు. కాగా తెలుగుదేశం పార్టీ తరఫున మచిలీపట్నం నుంచి ఎంపీగా రాజకీయాల్లోనూ రాణించారు. 2022 డిసెంబరు 23న కన్నుమూశారు.

రథోత్సవానికి ఘనస్వాగతం

పెనుకొండ, జూలై 24(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా విశ్వశాంతి కోరుతూ దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న సత్యసాయి ప్రేమవాహిని రథోత్సవం గురువారం పెనుకొండకు చేరుకుంది. పెనుకొండ ప్రజలు ఘనస్వాగతం పలికారు.





కళాసిపాళ్య బస్టాండ్‌లో గుంతలతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు, స్థానికులు

కళాసిపాళ్యలో ప్రయాణం భయం.. భయం!

బెంగళూరు, జూలై24 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెజిస్టిక్ బస్టాండ్ తర్వాత కళాసిపాళ్య బస్టాండ్‌కే ప్రాధాన్యం ఉంది. ఇక్కడి నుంచే నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్ళేందుకు అనుకూలంగా బీఎంటీసీ బస్సులు, కనకపుర, ఆనేకల్, హోసూరుతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్ళే కేఎస్ ఆర్టీసీ బస్సులు, వివిధ రాష్ట్రాలకు వెళ్ళే వందలాది ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీలు కళాసిపాళ్యలోనే ఉన్నాయి. ఇలా రోజూ వేలాది మంది ఇక్కడి నుంచే రాకపోకలు జరుపుతుంటారు. అటువంటి రద్దీగా ఉండే కళాసిపాళ్య ప్రాంతంలో నడచి వెళ్ళాలంటే సాధ్యం కాదనేలా రోడ్డులో గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్రవాహనాలు, లగేజి వ్యాన్‌లు, బస్సులు సైతం గుంతల నుంచి వెళితే ఒక్కసారిగా దూకినట్లు అవుతుంది. నెలల కాలంగా ఇలా గుంతలు ఉన్నా బెంగళూరు పాలికెకు కూతవేటు దూరంలోని కళాసిపాళ్య బస్టాండ్‌లో రోజు వేలాది మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. బ్రాండ్ బెంగళూరు అనే పాలకులు కళాసిపాళ్యను సందర్శిస్తే ఇక్కడి పరిస్థితి అర్థమవుతుందని స్థానికులు మండిపడుతున్నారు.

అరుణాచల్‌ప్రదేశ్ పర్యాటకానికి ప్రాధాన్యం

- ట్రావెల్ మార్ట్‌లో మంత్రి పసంగ్‌దోర్జిసోనా



మేళాను ప్రారంభిస్తున్న మంత్రి పసంగ్ దోర్జి సోనా

బెంగళూరు, జూలై24(ఆంధ్రజ్యోతి): శాంతి, ప్రశాంతత, పర్యాటకానికి అవినాభావ సంబంధం ఉందని అటువంటి ప్రాధాన్యం అరుణాచల్ ప్రదేశ్‌లో కల్పించి పర్యాటక రంగానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఆ రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి పసంగ్ దోర్జి సోనా అన్నారు. గురువారం నగరంలోని ప్యాలెస్ మైదానంలో ఇండియా ఇంటర్నేషనల్ ట్రావెల్ మార్ట్ పర్యాటక మేళాను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పర్యాటకం నుంచి సంస్కృతి పెరుగుతుందన్నారు. కర్ణాటక పర్యాటక శాఖ డైరెక్టర్ డాక్టర్ రాజేంద్ర మాట్లాడుతూ ప్రతి వ్యక్తి భిన్నమైన ప్రాంతాల ద్వారా కొత్త అనుభవాలను తెలుసుకోవడంతో పాటు బిజీ జీవితం నుంచి ప్రశాంతత సాధ్యం కానుందన్నారు. పర్యాటకమంటే ప్రయాణం, ఆతిథ్యం, ప్రశాంతతలు ఒకే గొడుగు కింద ఉంటాయన్నారు. ప్రదర్శనలకు 25 రాష్ట్రాలతో పాటు 20 అంతర్జాతీయ స్టాల్స్‌తో కలిపి 800లకు పైగా ఎగ్జిబిటర్స్ పాల్గొంటున్నారన్నారు. ప్రత్యేకించి రాష్ట్రంలోని కొడగు, తీరప్రాంత జిల్లాలకు చెందిన చిక్కమగళూరు, కొడుగు జిల్లాల సంస్కృతిని చాటేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారన్నారు. ప్రదర్శనల నిర్వాహకులు స్పియర్ ట్రావెల్ మీడియా డైరెక్టర్ సంజయ్‌హఖు మాట్లాడుతూ దేశవిదేశాలలో పర్యటించాలనే ఆలోచనలు కలిగిన వారికి కొత్త అనుభవంతో పాటు వివిధ ప్రాంతాల సౌలభ్యాలు, సంస్కృతి చాటేలా ప్రద్శనలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 26వరకూ ప్రదర్శనలు ఉంటాయని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మార్ట్‌లో వివిధ రాష్ట్రాల స్టాళ్లు

కసాపురానికి శ్రావణ శోభ

- నెట్టికంటి దర్శనానికి పోటెత్తనున్న భక్తులు
- శనివారాల్లో వాహనసేవలు
- మంగళవారాల్లో వెండి రథోత్సవాలు



నెట్టికంటి ఆంజనేయస్వామి విరాట్టు

గుంతకల్లు, జూలై 24(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం ప్రారంభం కానుండగా కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం నెలరోజులపాటు శోభాయమానం కానుంది. ఆంజనేయ స్వామి భక్తులు వేయి కన్నులతో ఎదురు చూసే శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభం కానుంది. శ్రావణ మాసం ప్రారంభమైన మరుసటిరోజే తొలి శనివారం. దీంతో నెలలో ఐదు శనివారాల్లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. నాలుగు మంగళవారాల్లో కూడా ప్రత్యేక పూజలు, స్వామివారికి విశేష అలంకారాలు చేయనున్నారు. ఈ తొమ్మిది రోజుల్లో జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, కర్ణాటక, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలి రానున్నారు.

పోటెత్తనున్న భక్తజనం

శ్రావణ మాసంలోని మంగళ, శనివారాల్లో ఒకేరోజు జిల్లాలోని కసాపురం, నేమకల్లు, మురడి గ్రామాలలోని ఆంజనేయస్వామి దేవస్థానాలను సందర్శించి, మొక్కులను తీర్చుకుంటారు. శనివారాల్లో కసాపురం ఆంజనేయ స్వామి దేవస్థానానికి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఉత్సవ కార్యక్రమాల్లో పాల్గొంచుకుంటారు. ఈసారి చివరిదైన ఐదో శనివారం అమావాస్య కావడంతో ఆరోజు భక్తులు నిదుర చేయడానికి పెద్దసంఖ్యలో తరలిరానున్నారు. భక్తులకు వసతి, రద్దీ నియంత్రణ, ప్రసాద వితరణ, అన్నదానం, వైద్యం, తాగునీటి సదుపాయాల కల్పనకు ఆలయ అధికారులు శుక్రవారం సమీక్ష నిర్వహించనున్నారు. ఉత్సవ దినాలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం కారణంగా ఆలయంలో ప్రదక్షిణను రద్దు చేయనున్నట్లు ఈఓ వాణి తెలిపారు. ఉత్సవాల్లో భక్తులను తరలించేందుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనుంది. గతేడాది గుంతకల్లు నుంచి కసాపురానికి ఎమ్మెల్యే సొంత ఖర్చుతో ఉచిత బస్సులను నడిపారు.

ఉత్సవ కార్యక్రమాలు ఇలా..

- జూలై 26వ తేదీ మొదటి శనివారం సీతారామ సహిత ఆంజనేయ స్వామికి శేషవాహనోత్సవం
- ఆగస్టు 2: స్వామివార్లకు హనుమద్ వాహనోత్సవం
- ఆగస్టు 9: స్వామివార్లకు గజ వాహనోత్సవం
- ఆగస్టు 16: స్వామివార్లకు గరుడ వాహనోత్సవం
- ఆగస్టు 23: ఒంటె వాహనోత్సవం
- జూలై 29, ఆగస్టు 5, 12, 19, తేదీల్లో నాలుగు మంగళవారాల్లో స్వామివార్లకు వెండి రథోత్సవం నిర్వహిస్తారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని పట్టుకుని ఇద్దరిని అరెస్టుచేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీ దుర్గయ్య తెలిపారు. పోచనపల్లివద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ప్రభుకుమార్ ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యం తీసుకొస్తున్నాడు. అతడిని పట్టుకుని ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపరచాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు పృథ్వీ, ఫారూక్, నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలిగ్రామానికి చెందిన 25యేళ్ల వివాహిత మహిళ యాసిడ్ తాగి గురువారం ఆత్మహత్యాకి పాల్పడ్డారు. భార్య భర్తల మధ్య నెలకున్న వివాదం కారణంగా ఇంటిలోని మరుగుదొడ్ల శుభ్రానికి ఉపయోగించే యాసిడ్ ద్రావకాన్ని తాగి అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించినట్లు వైద్యులు తెలిపారు.

నీటికుంటలో పడి వృద్ధురాలి మృతి

పరిగి, జూలై 24(ఆంధ్రజ్యోతి): శీగుపల్లికి చెందిన గంగమ్మ(76) నీటికుంటలో పడి మృతిచెందినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. గంగమ్మ నీటికుంటవద్దకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందినట్లు తెలిపారు. స్థానికుల సమాచారంతో మృతదేహాన్ని వెలకితీసి పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- విద్యార్థులతో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

బాగేపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని జాతీయ రహదారి 44పై టోల్‌ప్లాజా సమీపంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాల విద్యార్థుల రాకపోకలకు వీలుగా ఆర్టీసీ బస్సు సేవలకు శ్రీకారం చుట్టారు. బస్సు సేవలను ఎమ్మెల్యే సుబ్బారెడ్డి ప్రారంభించారు. పట్టణానికి శివారులో ఉన్న ప్రభుత్వ కళాశాలకు రోడ్డు మార్గం ఉన్నప్పటికీ, సరిహద్దు ప్రదేశం కావడంతో ఇక్కడ ఇంటర్‌స్టేట్ సర్వీసులు అధికమన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు వీలుగా సదుపాయం కల్పించామన్నారు. ఆర్టీసీ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణం నుంచి టీబీ క్రాస్‌లోని కళాశాలకు బస్సు సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కళాశాలకు వెళ్లేందుకు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు, మరియు వాపసు వచ్చేందుకు మధ్యాహ్నం 1.30 గంటలకు బస్సు సర్వీసులు కల్పించినట్టు తెలిపారు. ప్రిన్సిపాల్ వై నారాయణ, సమితి అధ్యక్షుడు నరేంద్ర, పురసభ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, హరీశ్, సర్దార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఏమిటో అతగాడి ధైర్యం..?

- డీపీఓలో డిజిటల్ అసిస్టెంట్ బరితెగింపు
- సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో అక్రమాలు
- చూసీచూడనట్లుగా ఉంటున్న డీపీఓ



అనంతపురం న్యూటౌన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఓ డిజిటల్ అసిస్టెంట్ బరితెగించి వ్యవహరిస్తుండటంతో జిల్లా పంచాయతీ కార్యాలయం(డీపీఓ)లో ఏమి జరుగుతోందో అర్థం కాని పరిస్థితి నెల కొంది. డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల్లో భాగంగా ఆ డిజిటల్ అసిస్టెంట్‌తో పాటు మరో గుమస్తా చేతులు కలిపి ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ప్రచారం ఉంది. ఆ డిజిటల్ అసిస్టెంట్ డీపీఓ పేరుతో తనకు కావాల్సిన వారికి, ముడుపులు ముట్టచెప్పిన వారికి ఎక్కడికి కావాలంటే అక్కడికి బదిలీ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గిట్టని వారికి చుక్కలు చూపించినట్లు ప్రచారం జరుగుతోంది. కింగ్‌పిన్‌గా చెప్పుకుంటునన ఆ డిజిటల్ అసిస్టెంట్ ఆత్మకూరు మండలం నుంచి అనంతపురం రూరల్‌కు బదిలీ చేయించుకున్నారు. ఇది ఎలా సాధ్యమో డీపీఓకే తెలియాలి. ఇదే మార్గంలో మరికొందరు ఉన్నారు. ఇక గిట్టని వారికి సంబంధించి... గత ఎడాదే అనిల్‌కుమార్ అనే డిజిటల్ అసిస్టెంట్ బదిలీపై రాజీవ్‌కాలనీ పంచాయతీకి వచ్చారు. కొద్దిరోజులు డీపీఓ, కలెక్టరేట్‌లో కూడా డెప్యుటేషన్‌పై పని చేశారు. ఆయన పేరు బదిలీలో లేకపోయినా, తన తల్లికి ఆరోగ్య సమస్యలు ఉన్నాయని చెప్పినా దూరంగా ఉన్న బెళుగుప్పకు పంపే ప్రయత్నం చేశారు. దీనిపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేయడంతో 'మీరు బెళుగుప్పకు వెళ్లినా సమస్య ఏముంటుంది? ఎలాగూ తిరిగి డెప్యుటేషన్‌పై కలెక్టరేట్‌లోనే కదా పని చేసేది' అని ఉచిత సలహా ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఆ డిజిటల్ అసిస్టెంట్ ఆక్రోశం భరించలేక 'మీరేందుకు ఆత్మకూరు నుంచి కందుకూరు వేయించుకున్నారు. మీరు కూడ డీపీఓ కార్యాలయంలోనే కదా డెప్యుటేషన్‌పై చేసేది మీరు బెళుగుప్ప ఎందుకు వేయించుకోలేదని డీపీఓ ఎదుటే ప్రశ్నించినట్లు తెలిసింది. దీన్ని విన్న డీపీఓ నాగరాజనాయుడు ఖంగుతిన్నట్లు సమాచారం. దీంతో ఇక్కడ ఉన్న సీసీల్లో ఎవరినైన అవసరం అయితే మరోప్రాంతానికి వేసి అయిన నీకు అన్యాయం జరగకుండా చూస్తానని డీపీఓ హామీ ఇచ్చినట్లు సమాచా రం. ఈ పరిణామాలు గమనిస్తే డిజిటల్ అసిస్టెంట్ ఏ స్థాయిలో చెలరేగిపోతున్నాడో అర్థం చేసుకోవచ్చు. బదిలీల కౌన్సెలింగ్‌లో భాగంగా అభ్యర్థులు రాసుకున్న ప్లేస్‌మెంట్స్‌ను కూడా మార్చినట్లు ప్రచారం ఉంది. దీంతో పాటు కలెక్టర్ ఆమోదం పొంది వచ్చిన జాబితాలో కూడా పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చేసి కలెక్టర్‌ను, డీపీఓను బురిడీ కొట్టించారన్న ప్రచారం జరుగుతోంది. ఇక మన పని అయిపోయింది. ఇక్కడే ఉంటే సమస్యల్లో పడే అవకాశం ఉంది. డెప్యుటేషన్ రద్దు చేయించుకుని, ఇక్కడి నుంచి జారుకుంటే బెటరని ఆ డిజిటల్ అసిస్టెంట్ తన సన్నిహితుల వద్ద చెప్పినట్లు సమాచారం. ఇంత తతంగం జరుగుతున్నా డీపీఓ నాగరాజనాయుడు మాత్రం ఏమి పట్టించుకోకుండా ఉంటున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

వరుస చోరీలతో ఆందోళన

రొప్పంలో ఒకేరాత్రి నాలుగు ఇళ్లలో..



పావగడ, 24(ఆంధ్రజ్యోతి): పట్టణవ్యాప్తంగా వరుసచోరీలు జరుగుతుండటంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. బుధవారం రాత్రి రొప్పంలో ఒకే వీధిలో నాలుగు ఇళ్లలో చోరీ అయ్యాయి. బాధితులు సంబంధిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సత్యనారాయణ, మంజుళ, శాంతమ్మ, మరో ఇంటిలో చోరీ జరిగింది. సత్యనారాయణప్ప బంధువుల ఇంటికి వెళ్లడంతో 10గ్రాముల బంగారం రూ.లక్ష నగదును చోరీ చేశారు. మంజుళ, శాంతమ్మ ఇంట్లో వారు నిద్రిస్తున్న సమయంలో బంగారు, నగదు దోచుకెళ్లినట్లు ఫిర్యాదుచేశారు. పట్టణంలో వరుస చోరీలపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిపోయిన హాస్టల్ విద్యార్థులు

పోలీసులకు ఫిర్యాదు చేసిన వార్డెన్



బాబు



నవదీప్



కె. మణికంఠ



ఎస్. మణికంఠ

అనంతపురం క్రైం, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ హాస్టల్‌లో ఉంటూ, పొట్టిశ్రీరాములు పాఠశాలలో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులు పారిపోయారు. పాఠశాలలో హెచ్‌ఎం మందలించినందుకు వారు ఇలా చేశారని అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. పారిపోయినవారిలో పదో తరగతి విద్యార్థులు ఇద్దరు, తొమ్మిది, ఎనిమిదో తరగతి విద్యార్థులు ఒక్కొక్కరు ఉన్నారు. ఉదయం పాఠశాలకు వెళ్లి విద్యార్థులు సాయంతమైనా హాస్టల్‌కు చేరలేదు. దీంతో వార్డెన్ మస్తాన్ మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, విద్యార్థుల కోసం గాలిస్తున్నామని త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. నార్పల మండలం నడిమిదొడ్డికి చెందిన నాగప్ప కుమారుడు బాబు(14), కూడేరు మండలం అరవకూరుకు చెందిన చంద్రశేఖర్ కుమారుడు నవదీప్(14), గోరంట్ల మండలం తోటమాకులపల్లికి చెందిన శేషాద్రి కుమారుడు కె.మణికంఠ(13), గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన విక్రాంత్ కుమారుడు ఎస్.మణికంఠ(12) అదృశ్యమయ్యారు. వీరంతా 3వ రోడ్డులోని బీసీ హాస్టల్ నంబర్ 2లో ఉంటూ, పొట్టి శ్రీరాములు పాఠశాలలో చదువుకుంటున్నారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని, టీసీ ఇచ్చి పంపుతామని హెచ్‌ఎం శ్రీదేవి మందలించారని, ఈ కారణంగానే విద్యార్థులు వెళ్లిపోయి ఉండవచ్చని వార్డెన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యార్థులు అదృశ్యమైన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశామని పేర్కొన్నారు. ముగ్గురు పిల్లలు స్కూల్ యూనిఫాం ధరించారని, విద్యార్థి బాబు పింక్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు వేసుకున్నారని వివరించారు.

కుక్కలతో జనం బెంబేలు



కుక్కలతో అనంతపురం నగర వాసులు ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు 50వేలకు పైగా కుక్కలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. నగరంలో రోజురోజుకు కుక్క కాటు బాధితులు పెరుగుతున్నారు. వాహనదారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, చిన్నారులు వీధుల్లో భయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. ఒక్కోసారి 10-15 కుక్కలు వీధుల్లో సంచరిస్తూ భయానక పరిస్థితులను సృష్టిస్తున్నాయి. కొన్ని వీధుల్లో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇంతటి భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్న కుక్కలను నియంత్రించడం, తరలించడంలో నగరపాలక సంస్థ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. నగరంలో అనిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) టీకాను ఉపయోగించి కుక్కలను నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది.



వృద్ధులపై దాడి చేస్తున్న శునకాలు



వాహనదారుడిపైకి ఎగబడుతున్న కుక్క

- నగరంలో 50వేలకుపైగా శునకాలు
- నియంత్రణ చర్యలు శూన్యం
- పెరిగిపోతున్న కుక్కకాటు బాధితులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థలో కుక్క కాటు బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. హౌసింగ్‌బోర్డులో ఇటీవల ఓ వ్యక్తి ఫిల్టర్ నీళ్ల కోసం వెళ్లిన సమయంలో కుక్క కాటుకు గురయ్యాడు. రామ్‌నగర్‌లో ఫ్రిజ్ రిపేరీ కోసం వెళ్లిన ఓ మెకానిక్‌ని రెండు నెలల క్రితం కుక్క కరిచిన దెబ్బతో నేటికీ నొప్పి తగ్గలేదని వాపోతున్నాడు. రామచంద్రనగర్‌లో ఓ చిన్నారి అంగడికి వెళ్లి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో కుక్క కాటుకు గురైంది. ఇలా నగరంలో రోజురోజుకి కుక్క కాటు బాధితులు పెరిగిపోతున్నారు.

కుక్క కాటుకు ప్రథమ చికిత్స

కుక్కకాటుకు శస్త్రచికిత్స గాయం తీవ్రతపై ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. చిన్న కాట్లకు సబ్బు, నీటితో కడగడం, యాంటీ బయోటిక్ లేపనం, శుభ్రమైన కట్టుతో కప్పడం వంటి ప్రాథమిక చికిత్స సరిపోతుంది. పెద్ద కాట్లకు వైద్యసంరక్షణ అవసరం ఉంటుంది. ఇందులో కుట్లు, యాంటీ బయోటిక్స్ లేదా రేబీస్ లేదా టాటానస్ టీకాలు వంటివి అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటు తర్వాత ఏవైనా ఇన్‌ఫెక్షన్ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.


ప్రభుత్వం అనుమతిస్తే ఏబీసీ కేంద్రం ఏర్పాటు



నగరంలో కుక్కల బెడద ఉన్న మాట వాస్తవమే. వీధి, పెంపుడు కుక్కలు నగరంలో రోజురోజుకు పెరిగిపోతున్నాయి. గతంలో కుక్కలు పట్టి తరలించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిస్తే కుక్కలను నియంత్రించవచ్చు. కుక్కల సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఉన్నతాధికారులకు పంపించాం. జంతుసంక్షేమ సంస్థల ఫిర్యాదుతో కుక్కలను పట్టకూడదని, ఏబీసీ టీకా వినియోగించరాదని ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వం అనుమతిస్తే ఏబీసీ సెంటర్ ఏర్పాటు చేయవచ్చు.

-రంగస్వామి, ఎంహెచ్ఓ





తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1625.88	1,627.21
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	36,539	1,13,402
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	39,457	4,798
నీటి నిల్వ (టీఎంసీలు)	79.40	83.95

నేటి నుంచి పాండురంగస్వామి సప్తాహం



పాండురంగ రుక్మిణీదేవి

బళ్లారి సిటీ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా పాండురంగా రుక్మిణీ సప్తాహం నగరంలోని రాజేశ్వరీనగర్‌లో శుక్ర వారం నుంచి జరగనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. నగరంలో ఎస్ఎస్.శాస్త్రి, లక్ష్మణరావు, విశ్వనాథ శాస్త్రి, నల్లారెడ్డి, పాండురంగ తదితరులు గత 8సంవత్సరాల నుంచి భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు నిర్వహిస్తున్నారు. ఈసారి విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా జూలై 25న ఉదయం నుండి సాంకాలం వరకు కాకడ హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తదనంతరం ప్రసాదాల పంపిణీ జరుగుతుంది. భక్తులు దర్శించుకుని తరించాలని కోరారు.

టాయ్‌లెట్‌లో రేషన్ బియ్యం

హోసూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలోని రాయకోట్టై హౌసింగ్ బోర్డు ప్రాంతంలో 14వ నెంబరు చౌకడిపో డీలర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. దుకాణం దుస్థితికి చేరుకుంది. దీంతో తాత్కాలికంగా ఉళవర్షంద్రై సమీపంలోని మలార్ వాణిజ్య సముదాయానికి మార్చారు. మూడు నెలలుగా ఇక్కడ నుంచి నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నారు. గురువారం డిపోకు వచ్చిన బియ్యం బస్తాలను సమీపంలోని ఒక టాయ్‌లెట్‌లో నిల్వ చేశారు. గమనించిన ప్రజలు డిపో డీలర్ ముత్తుమ దేవన్‌తో వాగ్వాదం చేశారు. దీంతో తాళం వేసి వెళ్లి పోయాడు. సమాచారం అందుకున్న రిజిస్ట్రార్ నటరాజ్ స్పందిస్తూ వెంటనే డీలర్ ముత్తుమదేవన్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. అంతేకాక టాయ్‌లెట్‌లో నిల్వ చేసిన 30 బస్తాల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయకుండా కార్పొరేషన్ గొడౌన్‌కు తరలించారు. డీలర్ నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రౌడకుందా గుట్టపై చిరుత సంచారం


గుట్ట పై కనిపించిన చిరుత

రాయచూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా రౌడకుందా గ్రామ సమీపంలో గల గుట్ట పై చిరుత సంచారాన్ని గ్రామస్థులు గుర్తించారు. కొన్నాళ్ల క్రితం గ్రామానికి చెందిన పశువులు అకస్మాత్తుగా చనిపోగా కొన్నింటి పై చిరుత దాడి జరిగినట్లు రైతులు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గుట్ట సమీపంలో క్షుణ్ణంగా తనిఖీ చేసిన అధికారులు చిరుత సంచరిస్తున్నట్లు జాడల ద్వారా గుర్తించి గుట్టకు ఇరువైపుల రెండు బోన్లను అమర్చారు. ఇది జరిగి నాల్గు రోజులు కావస్తున్నా ఇప్పటికి చిరుత బోనుకు చిక్కక పోవడం గమనార్హం. కాగా బుధవారం రాత్రి వేళ చిరుత గుట్టపై సంచరిస్తున్నట్లు చూసిన గ్రామస్థులు బెంబేలెత్తిపోతున్నారు.

నేడు వసుంధరాదేవి రాక

హిందూపురం, జూలై 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి శుక్రవారం హిందూపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. గోళ్లాపురం వద్ద రూ.3కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తారు. చిలమత్తూరు మండలం తమ్మినాయనపల్లి రోడ్డుకు భూమి పూజ, లేపాక్షి మండలం బిసలమానేపల్లి-ఓబుళాపురం తారు రోడ్డు ప్రారంభోత్సవం, నవోదయ పాఠశాలలో సోలార్ గీజర్‌లు ప్రారంభం, సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొననున్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

● సాంకేతికతను ఉపయోగించుకోవాలి ● అధికారులు.. వాహనదారులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర్, ఎస్పీ జాహ్నవి

బళ్లారి సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లా వ్యాప్తంగా నగరాలు, పట్టణాలు, ముఖ్యమైన రోడ్లలో ప్రమాదాలను నివారించాలని, ప్రమాదస్థలాలను గుర్తించి శాస్త్రీయంగా రోడ్ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్.దివాకర్ పీడబ్ల్యూడీ అధికారులకు సూచించారు. గురువారం జిల్లాకలెక్టర్ కార్యాలయ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.పట్టణాల్లో వాహనాలు వేగంగా నడుపుతున్నట్లు అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వేగాన్ని నియంత్రించడానికి చిన్నచిన్న రోడ్ బ్లాక్‌లను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాల, కళాశాల రోడ్లతో సహా పెద్ద సంఖ్యలో వాహనాలు ఉన్న రోడ్లను గుర్తించాలన్నారు. అనేక ప్రమాదాల్లో మరణాలు లేనప్పటికీ, వాహనదారులు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న సందర్భాలున్నాయని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల వేగాన్ని నియంత్రించడానికి కొన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్య కారణంగా ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల సమావేశంలో ,జాతీయ రహదారిపై మొత్తం 6బ్లాక్ స్పాట్‌లను గుర్తించారు. 5బ్లాక్ స్పాట్‌లను ఇప్పటికే మరమ్మతులు చేశామన్నారు. మిగిలిన 1బ్లాక్ స్పాట్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ సూచించారు. హొస్పేట్ నగరంలో వర్షం కారణంగా రోడ్డుపై నీరు పేరుకుపోతోంది. రోడ్డుపై ఉన్న నీరు కాలువల్లోకి సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలి. జాతీయ రహదారి హొసహళ్ళి రోడ్డుకు సమీపంలో 300మీటర్ల పొడవైన డ్రైయిన్ నిర్మించాలని, రోడ్డుపై ఉన్న చెత్తను తొలగించాలని ఆయన సూచించారు. భట్రహళ్ళి ఆంజనేయ ఆలయానికి వెళ్ళే రహదారిలో చాలా మలుపులు ఉన్నాయి. ప్రమాదాలు జరగుతున్నట్లు నివేదికలు ఉన్నాయి. జాతీయ రహదారిపై పాపినాయకనహళ్ళి, వడ్డరహళ్ళిలోని రోడ్లపై చాలా గుంతలు ఉన్నాయి. రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. హైవేల పై ప్రమాదాల నివారణకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అనంతశయనగుడి రోడ్డుపై ఫ్లైఓవర్ నిర్మాణం నేపథ్యంలో తాత్కాలికంగా రోడ్డు రాకపోకలకు అనుమతించబడిన రహదారి కూడా పాడయి పోయిందని మరమ్మతులు చేపట్టాలన్నారు. బైక్‌లు, ఆటోలు, కార్ల రాకపోకలకు సమస్యగా మారిందన్నారు. రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయడం వల్లే ప్రయాణికులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. నగర జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు రోడ్డును దాటుతున్న చెల్లకొమ్మలను తొలగించాలన్నారు. జిల్లా ఎస్పీ జాహ్నవి మాట్లాడుతూ ప్రజాపనుల శాఖ అధికారులు ఏదైనా రోడ్లపై బ్లాక్‌లను ఏర్పాటు చేసే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల సలహా తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా రవాణా శాఖ, పీడబ్ల్యూడీ, ఎన్‌హెచ్‌ఏఐ సహా జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే మున్సిపాలిటీలో పనులు

సమావేశంలో ప్రతిపక్ష కౌన్సిలర్ల ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ హనుమంతు

కంప్లి, జూలై24(ఆంధ్రజ్యోతి): కంప్లి మున్సిపాల్టీలో డబ్బులు ఇచ్చిన వారికే త్వరగా పనులు పూర్తి అవుతాయని కౌన్సిలర్ సీఆర్ హనుమంతు, వీఎల్ బాబు ఆరోపించారు. గురువారం మున్సిపాల్టీలో ఏర్పాటు చేసిన కౌన్సిలర్ల సమావేశంలో తెలిపారు. మున్సిపాల్టీలో వుండే సిబ్బంది పట్టణంలోని 23 వార్డుల ప్రజలు తమ సమస్యల పైన ఫారం త్రీ మ్యుటేషన్ ఇతర పనులు త్వరగా పనులు పూర్తి కావాలంటే డబ్బులు ఇవ్వవలసిందేనని, మధ్యవర్తుల మున్సిపాల్టీగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై మధ్యవర్తులకి ఎక్కువగా ప్రాధాన్యం కల్పించినట్లయితే వారిపైన చర్యలు తీసుకునేలా అధికారులకు తెలుపుతామన్నారు. అనంతరం బీఎస్సీ పాఠశాల పదాధికారులతో చర్చలు తమకు ఇచ్చిన సమయంలో గా ఖాళీ చేయాలని తెలిపారు. త్వరలోనే కంప్లి మున్సిపాల్టీ బదులుగా నగరసభ అవుతుందని అందుకు గాను ఇప్పుడే ప్రభుత్వం రూ. ఏడు కోట్లకు పైగా నిధులు కూడా మంజూరవుతున్నట్లు తెలిపారు. మారెమ్మ దేవస్థానం నుంచి సన్నాపురం వెళ్లే రోడ్డులో దుకాణాల ముందుండే కాయగూర బండ్లను తొలగించాలని అధ్యక్షులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షులు బట్ట ప్రసాద్, ఉపాధ్యక్షురాలు సుశీలమ్మ స్టాండింగ్ కమిటీ అధ్యక్షులు ఉస్మాన్ ముఖ్య అధికారి మల్లికార్జున, కౌన్సిలర్లు నామినేట్ కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరతను తీర్చండి

కేంద్ర మంత్రి సోమణ్ణకు ఎంపీ తుకారాం వినతి


మంత్రి సోమణ్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ తుకారాం

బళ్లారి సిటీ,జూలై 24(ఆంధ్రజ్యోతి): సాగు పనులు ముమ్మరం అయ్యాయని,రైతులు కు ఎరువుల కొరత లేకుండా చూడాలని అఖండ బళ్లారి జిల్లా ఎంపీ ఈ.తుకారం కేంద్ర రైల్వే , జలశక్తి శాఖ సహాయ మంత్రి సోమణ్ణను కోరారు. గురురవారం ఢిల్లీలో మంత్రిని కలిసిన ఎంపీ పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. వర్షకాలంలో రైతులకు యూరియా, ఇతర ఎరువుల సరఫరా కావడం లేదని, దీంతో వారి వ్యవసాయ కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. దీనిపై స్పందించిన మంత్రి సోమణ్ణ మాట్లాడుతూ బళ్లారి రైల్వే స్టేషన్ జంక్షన్ నంబర్లు 6, 8 వద్ద ఎరువులు అన్‌లోడ్ చేయడానికి వెంటనే అనుమతి మంజూరు చేస్తానన్నారు. బళ్లారి జిల్లాలోని రైతులందరికీ డిమాండ్ ఉన్న మేరకు ఎరువులను సరఫరా చేయడంలో ఎటువంటి సమస్య లేకుండా చూస్తామన్నారు.

భారీ వర్షానికి కొట్టుకుపోయిన వంతెన

రాయచూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజలు ముఖ్యంగా రైతులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. రాయచూరు తాలూకాలోని పత్తేపూర్ గ్రామం పై ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన గురువారం కురిసిన భారీ వర్షానికి కొట్టుకు పోయింది. దీంతో పత్తేపూర్. రఘునాథ హళ్ళి తదితర ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురైయ్యారు. పొలం పని కోసం వెళ్లిన రైతులు, పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులు వంతెన లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురైయ్యారు. కాగా ఈ వాగుపై శాశ్వత వంతెన నిర్మాణం కోసం రూరల్ ఎమ్మెల్యే దద్దల బసనగౌడ మూడు నెలల క్రితం నిధులు మంజూరు చేయించి పనులకు భూమిపూజ చేశారు. ఆ సందర్భంగా వర్షకాలం ప్రారంభంలోగా వంతెన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కాగా సగం వరకు పనులు చేసిన కాంట్రాక్టర్ బిల్లులు రాలేదన్న కారణంగా పనులను నిలిపివేశారు. రాకపోకలకు ఇబ్బంది జరగకుడదన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన వంతెన కొట్టుకు పోయింది.


కొట్టుకుపోయిన తాత్కాలిక వంతెన


వంతెనను దాటేందుకు ఇబ్బందులు పడుతున్న బాలురు

అభివృద్ధికి అందరూ సహకరించాలి: ఎమ్మెల్యే

కంప్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, పట్టణాల్లో జరిగే అభివృద్ధి పనులకు పార్టీలు విడనాడి ప్రతి ఒక్కరు ముందుకు వచ్చినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. గురువారం కొత్త నెల్లూడి ప్రభు క్యాంపు చిన్నాపురం అంజనాపురం అభివృద్ధి పనులకు భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో గతంలో రోడ్ల అభివృద్ధి లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారు వాటిని దృష్టిలో వుంచుకుని విధానసభలో తమకు రోడ్ల నిర్మాణం ఏర్పాటు కోసం ప్రత్యేకించి నిధులు కేటాయించుకుని నూతన రోడ్లు ఏర్పాటు చేశాం. కానీ గ్రామాల్లోని రైతన్నలు నూతన రోడ్లు లెక్కచేయకుండా తమ పొలంలో సేద్యం కోసం ఇంట్లో నుండే ట్రాక్టర్‌కు పొలం వరకు ఇనుప చక్రాలు వేసుకుని వెళ్లడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయన్నారు. కనుక ప్రతి ఒక్కరు నూతన రోడ్ల దృష్టిలో వుంచుకుని పొలం వద్దకు వెళ్లిన తరువాత ట్రాక్టర్‌కు ఇనుప చక్రాలు వేసుకుని సేద్యం చేసుకోవాలని రైతులను కోరారు. ఇప్పటికే కంప్లి, కురుగోడు తాలుకాలో పూర్తిగా అభివృద్ధి పనులు జరిపాము. కాస్త కూస్తో మిగిలి వున్న గ్రామాల్లో కూడా సర్వే చేపట్టి అవి కూడా పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో బీజేపీ పార్టీ నాయకులు, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన గ్యారెంటీ పథకాలను ఆవేదన చేసి మాట్లాడటం సరికాదన్నారు. తమ రాష్ట్రంలో అమలు చేసిన పథకాలే వేరే రాష్ట్రంలో కూడా అవే పతకాలు మంజూరు చేశారన్నారు. ప్రతి పేద కుటుంబాన్ని దృష్టిలో వుంచుకుని తమ నాయకులు సిద్దరామయ్య పథకాలను అందించారని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ మెంబర్ తిమ్మప్ప ప్రసాద్, నాగరాజు, హనుమంతు, షణ్ముఖప్ప, హబీబుర్ రెహమాన్ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

హోసూరు జోన్

మట్టిరోడ్లను బాగు చేయండి


బురదలో చిక్కుకున్న వాహనంతో ఇబ్బంది పడుతున్న స్థానికులు

హోసూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కెలమంగలం యూనియన్ పరిధిలోని అటవీప్రాంతాల గ్రామాలకు సరైన రోడ్లు లేవు. చాలావరకు మట్టిరోడ్లు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో బురదమయంగా మారాయి. మట్టి రోడ్లను బాగు చేయాలని డెంకణీకోట సమీపంలోని బెట్టముఖిలాలం, తోవపెట్ట కొండప్రాంతాలకు గ్రామపజలు కోరుతున్నారు. రోజువారీ కూలి పనులకోసం ప్రతిరోజూ సుమారు 40 కిలోమీటర్ల ప్రయాణించాల్సి ఉంటుందని, తరచూ ఈ రోడ్లపై పలు కారణాలతో ఆగిపోతుంటాయని సరైన రవాణా వ్యవస్థ కల్పించాలని కోరుతున్నారు. ఒక గూడ్స్ వాహనం బురదలో చిక్కుకుపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు సహాయం చేశారు. ఇలా ఒక్కోసారి అంబులెన్స్‌లు కూడా ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయన్నారు.


కమిషనర్‌తో చర్చిస్తున్న బీజేపీ నాయకులు

నగర సమస్యలపై కమిషనర్‌కు బీజేపీ వినతి

హోసూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలో పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హోసూరు నగర కౌన్సిల్ మాజీ సభ్యుడు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు నాగరాజ్ నేతృత్వంలో బీజేపీ బృందం కమిషనర్ మహ్మద్ షబ్బీర్ ఆలంను గురువారం భేటీ అయ్యింది. ప్రధానంగా ఎంజీ రోడ్డు ప్రాంతంలో టాయ్‌లెట్ సదుపాయం కల్పించాలని, ఎంజీ రోడ్డు, నేతాజీ రోడ్లలో ఫుట్‌పాత్ నిర్మించాలని, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద బస్టాప్ నిర్మించాలని, చంద్రచూడేశ్వరస్వామి ఆలయ కొండపై నిర్లక్ష్యానికి గురైన పిల్లల పార్కును బాగుచేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఈ సందర్భంగా బృందంలో కౌన్సిల్ సభ్యురాలు పార్వతి నాగరాజ్‌తోపాటు రాష్ట్ర జనరల్ కమిటీ సభ్యుడు మురుగన్, జిల్లా ఉపాధ్యక్షుడు మంజుల, జిల్లా కార్యదర్శి రమేశ్‌కన్నన్ భేటీ అయ్యారు. ఐదు ప్రధాన డిమాండ్లను ప్రస్తావించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు శ్రీనివాసన్, కిశోర్, శివలత, ఉమా మహేశ్వరి, సురేశ్ మురళి, ప్రదీప్‌కుమార్ తదితరులు ఉన్నారు.


అలంకరణలో ఎర్రితాత, కుమారస్వామి, కనకదుర్గమ్మ

ఆలయాల్లో అమావాస్య పూజలు

బళ్లారిరూరల్, జూలై24(ఆంధ్రజ్యోతి): అమావాస్య సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం తాలుకాలోని చేళగుర్కి ఎర్రితాతకు విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజల సందర్భంగా ఇటు కర్ణాటక, ఆంధ్ర నుండి పెద్దఎత్తున భక్తాదులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బళ్లారి ఆరాధ్య దైవం కనకదుర్గమ్మ అమ్మవారిని అమావాస్య సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. నగరంలో ఫైర్ ఆఫీసు సమీపంలో ఉన్న కుమారస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు.

కంప్లి, (ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని పలు గ్రామాల్లో అమావాస్య సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. బుక్కసాగర ఏడుపడగల నాగప్ప దేవస్థానంలో అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కంప్లి షుగర్ ఫ్యాక్టరీలో కాళికాదేవి ఆలయంలో అమ్మవారి ఆకుపూజలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. సన్నాపురం గ్రామంలో ఉద్భవ వీరభద్ర ఆలయంలో భక్తాదులు పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. హులిగమ్మదేవిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టుకున్నారు. శ్రావణమాసం ప్రారంభం ఏ ఆలయంలో చూసిన భక్తాదులతో కిటకిట లాడుతున్నాయి. ఆలయాలకు వచ్చిన భక్తాదులకు ఆలయ కమిటీ అన్నదానం చేపట్టారు.


ఏడుపడగల నాగప్ప, అమ్మవారు, ఉలిగమ్మ

ఇనుప చక్రాలు వాడితే కఠినచర్యలు: ఎస్ఐ


రైతులకు సూచనలిస్తున్న ఎస్ఐ సుప్రీత్

కంప్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఇనుప చక్రాలతో తారురోడ్లపై ప్రయాణిస్తే చర్యలు తప్పవని కురుగోడు ఎస్ఐ సుప్రీత్ విరుపాక్షి హెచ్చరించారు. గురువారం ఆయన పట్టణంలో రహదారులపై తనిఖీ నిర్వహించారు. ఇలా డాక్టర్లకు ఇనుప చక్రాలు వేయడం వల్ల గుంతల రోడ్లు అవుతున్నాయని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గ ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ ఈ విషయంపైన రైతులకు అవగాహన కూడా కల్పించారు. వాటిని లెక్కచేయకుండా రైతులు తమ పనులు త్వరగా ముగించుకునేందుకు ఇళ్ల నుండే ట్రాక్టర్లకు ఇనుప చక్రాలను వేసుకుని వెళ్తున్నారు. అలా చేయడం వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసమై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. ఎమ్మిగనూరు హెచ్ వీరాపుర, ముష్టిగట్టి, బాదనట్టి, కలకంబ్ల తదితర గ్రామాల్లో రైతన్నలకు దండోరా వేయించి తెలిపామన్నారు. వారితో పాటు పోలీసు సిబ్బంది రాజశేఖర్ రైతులు పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

రాయచూరు, జూలై 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణగిరి హిల్స్ కాలనీలో బుధవారం అర్ధరాత్రి తాళం వేసిన ఇంట్లో దొంగతనం జరిగింది. తాళం వేసిన ఇంటి తాళాలు విరిగి పడి ఉండడాన్ని దర్వాజాలు తెరిచి ఉండడాన్ని గమనించిన ఇరుగు-పొరుగు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు ఇంటి యజమానులెవ్వరు లేకపోవడంతో ఎదురుగా ఉన్న ఇంటి సీసీ కెమెరాల ఆధారంగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. అర్ధరాత్రి దాటిన అనంతరం సుమారు 1:24 నిమిషాల టైమింగ్‌లో నలుగురు దొంగలు ఇంట్లో నుంచి బయటికి వస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలు నిక్షిప్తమైయ్యాయి. బాధితులు వస్తేగాని ఇంట్లో ఎంతమేరకు దొంగతనం జరిగిందన్నది తెలియాల్సి ఉంది. ఇంట్లో సమానంతా చిందరబందరంగా పడి ఉండడాన్ని గుర్తించిన పోలీసులు ఇంటి యజమానులకు సమాచారం చేరవేశారు.

'మా' క్లినిక్‌తో నాణ్యమైన వైద్యం

● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే నారా


'మా'క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారి సిటీ, జూలై 24(ఆంధ్రజ్యోతి): 'మా'క్లినిక్ నగరంలోని నివాస ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన సేవకు ప్రాధాన్యం ఇస్తుందని, నగర పౌరులకు స్థానికంగా చికిత్స పొందడానికి ఇవి ఎంతో ఉపయోగకరమని నగర ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ , జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మున్సిపల్ కార్పోరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని కరిమారెమ్మ కాలనీలో ప్రారంభించిన నూతన 'మా' క్లినిక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ క్లినిక్‌లతో ఆరోగ్య సమస్యలకోసం ప్రజలు చాలా దూరం ప్రయాణించాల్సిన అవసరం ఉండదని, నగరంలోని పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు సత్వర సేవలు అందించడానికి ఇవి ఉపయోగపడుతాయన్నారు. రాబోయే రోజుల్లో ఈ కాలనీలో సుమారు రూ. 5కోట్ల వ్యయంతో ఒక సుంపన్నమైన ఆసుపత్రిని నిర్మిస్తామన్నారు. జిల్లాఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డా.రమేశ్‌బాబు మాట్లాడుతూ 2023-24సంవత్సరానికి బళ్లారి జిల్లాకు 12 నమ్మక్లీనిక్‌లు మంజూరు చేయగా, 2024-25 సంవత్సరానికి బళ్లారి నగరంలో 6, సిరుగుప్పలో01, కంప్లిలో 01, సహా మొత్తం 08మా క్లినిక్‌లు మంజూరు అయ్యాయన్నారు. బళ్ళారిలో 3 క్లీనిక్‌లు ప్రారంభించారన్నారు. బళ్లారి జిల్లాలో ప్రజారోగ్య సేవల కోసం మొత్తం 20 మా క్లినిక్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు.సోమవారం నుంచి శనివారం వరకు మా క్లినిక్‌లలో సేవలు అందుబాటులో ఉంటాయని , వైద్యాధికారి, నర్సింగ్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్లు, డీ-గ్రేడ్ ఉద్యోగులు ఉంటారన్నారు. తరువాత నగరంలోని శ్రీరాంపూర్ కాలనీ , ఏపీఎంసీ మార్కెట్ ప్రాంతాలలో మొత్తం మూడు క్లినిక్‌లు ప్రారబించారు. ఈసందర్భంగా మున్సిపల్ కార్పోరేషన్ సభ్యుడు మించు శ్రీనివాస్, జిల్లా సర్జన్ బసారెడ్డి, జిల్లా ఆర్‌సీహెచ్ అధికారి డా.హనుమంతప్ప, జిల్లాసర్వే అధికారి డాక్టర్ మరియంబి, జిల్లా కుష్టువ్యాధి నిర్మూలన అధికారి డాక్టర్ వీరేంద్ర కుమార్, జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి. జిల్లా ఆరోగ్య విద్య అధికారి ఖుర్షిద్ బేగం ప్రజలు పాల్గొన్నారు.